క్లుప్తంగా

పుల్వామా వీరులకు నివాళి

ఖానాపూర్: ప్రభుత్వం పుల్వామా ఘటనలో అమరులైన జవాన్ల గుర్తుగా ఫిబ్రవరి 14ను వీరజవాన్ దివాస్‌గా నిర్వహించాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా సంయోజక్ కాశవేని ప్రణయ్ అన్నారు. బుధవారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో పుల్వామా ఘటనలో అమరులైన వీరులకు నివాళులర్పించారు. ప్రేమికుల రోజును నిషేధించాలన్నారు. విదేశీ సంస్కృతి వద్దు.. భారతదేశ సంస్కృతి ముద్దు అంటూ ఉగ్రవాదుల చిత్రపటాలు, గ్రీటింగ్ కార్డులు దహనం చేశారు. శివగౌడ్, శ్రీను, రాజశేఖర్, సంజయ్, హరీశ్, అజయ్, లోకేశ్, భూమేశ్, సాయి పాల్గొన్నారు.

గ్రామాల్లో గస్తీ నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

కుంటాల: గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా గస్తీ నిర్వహించాలని భైంసారూరల్ సీఐ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మహారాష్ట్ర సరిహద్దులో అక్రమ రవాణా జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఎస్సై హన్మాండ్లు తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు



విరాళం ఇస్తున్న భక్తులు

సోన్: మండల కేంద్రంలో శ్రీ గొడిసేర్యాల రాజరాజేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం పలువురు దాతలు విరాళాలు సమర్పించారు. సోన్‌కు చెందిన సత్యనారాయణ రూ.50వేలు, నిజామాబాద్ జిల్లా కొత్తపల్లికి చెందిన రవీందర్‌రెడ్డి రూ.21వేలు, పాక్‌పట్లకు చెందిన రాజారెడ్డి రూ.5,555, గోపి మెస్త్రీ 101 సిమెంట్ బస్తాలను ఆలయ వ్యవస్థాపకులు సదానంద్ స్వామికి విరాళంగా అందించారు. శివ భక్తులు తదితరులున్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

భైంసాటౌన్: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పట్టణ సీఐ రాజారెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జీపీ లడ్డా డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపవద్దన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

చెరువుకట్ట పనులు ప్రారంభం

నర్సాపూర్(జి): మండలంలోని బామిని(బి)లో డ్రీమ్ సొసైటీ రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామ చెరువు కట్టను బలోపేతం చేసే పనుల ప్రారంభానికి భూమి పూజ చేసినట్లు సొసైటీ మండల కోఆర్డినేటర్ మురళి పేర్కొన్నారు. చెరువు కట్టపై నుంచి రాంనగర్‌తండా, పొలాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దేవోళ్ల పోశెట్టి, విఠల్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ వేణుగోపాల్, కార్యదర్శి గంగాజల, కాంట్రాక్టర్ రాము, ఇంజినీర్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నులు పంపిణీ

నిర్మల్: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి వసంత పంచమి వేడుకలను పురస్కరించుకొని చిలు కూరు బాలాజీ ఆలయం పెన్నులను పంపిణీ చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థుల కోసం సుమారు రెండు లక్షలకు పైగా పెన్నులను పంపించింది. బుధవారం బాసరలో చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకులు, నిర్వాహకులు పెన్నులు పంపిణీ చేశారు.

గ్రామదేవతల ఆలయ వార్షికోత్సవం



ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడిలో గ్రామదేవతలైన ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ, చిలకచిన్నమ్మ ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు బోనాలతో వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. అనంతరం బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఇంద్రకరణ్‌గౌడ్, వీడీసీ సభ్యులు గంగాధర్, పీరు పటేల్, నారాయణ, భోజప్ప పటేల్, లింగన్న, రాజారెడ్డి, భోజారెడ్డి, సాయి, రవి ఉన్నారు.

హరితహారం.. అభాసుపాలు



లక్ష్మణచాంద సమీపంలో నిప్పు పెట్టడంతో దెబ్బతింటున్న చెట్లు

- మొక్కలకు నిప్పు పెట్టి తొలగిస్తున్న రైతులు
- వృథాగా ప్రభుత్వధనం
- పట్టించుకోని అధికారులు

లక్ష్మణచాంద: రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసేలా అడవుల శాతం పెంచేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిన హరితహారం అభాసుపాలవుతోంది. నాటిన మొక్కలకు పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ ద్వారా నీటిని అందించి కంటికి రెప్పలా కాపాడటంతో అవి ఏపుగా పెరిగాయి. కానీ చెట్లుగా మారిన తర్వాత సంరక్షించడంలో అధికారులు విఫలం అవుతుండటంతో అవి కనుమరుగవుతున్నాయి.



పొలం పక్కన చెట్టు దుస్థితి

లక్ష్మణచాంద మండలంలో..

కనకాపూర్ నుంచి లక్ష్మణచాంద వరకు వెళ్లే మార్గంలో డబుల్‌రోడ్డుపై ఆరు కిలోమీటర్ల మేర అటవీ శాఖ ఆధ్వర్యంలో హరితహారంలో భాగంగా సుమారు రెండు వేల మొక్కలు నాటారు. మొక్కలు ఏపుగా పెరగడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారికి ఆహ్లాదం పంచేవి. కానీ ఆయా గ్రామాల్లో రోడ్డును ఆనుకొని భూములున్న కొందరు రైతులు ఏపుగా పెరిగిన చెట్లను గొడ్డలితో కొట్టేస్తున్నారు. మరికొందరు తమ భూముల్లోకి వచ్చాయని చెట్ల కొమ్మలు తొలగిస్తున్నారు. ఇంకొందరు చెట్టు కాండం చుట్టూ వరిపొట్టు పోసి నిప్పు అంటిస్తున్నారు. దీంతో కష్టపడి నాటి పెంచిన మొక్కలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని పలువురు మండల ప్రజలు పేర్కొంటున్నారు.



నిప్పు పెట్టేందుకు కాండం చుట్టూ పోసిన వరిపొట్టు

అధికారులు స్పందించాలి..

ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను కొట్టేయకుండా చర్యలు తీసుకోవాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

లోకేశ్వరం మండలంలో..

లోకేశ్వరం: మండలంలో హరితహారం లక్ష్యం నీరుగారుతోంది. పలు గ్రామాల్లో కొందరు అధికారులు ప్రణాళికలేమితో రోడ్ల వెంట విద్యుత్ తీగల కింద మొక్కలు నాటారు. మొక్కలు కొంచెం పెరగగానే విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు కొమ్మలను నరికేస్తున్నారు. కొన్ని చోట్ల చెట్లను కూడా తొలగిస్తున్నారు. పంచాయతీ అధికారులు మళ్లీ అదే ప్రాంతంలో మొక్కలు నాటుతున్నారు. అయితే మొక్కలను అధికారులు లెక్కల కోసం నాటుతున్నారా.. లేక సంరక్షణ కోసమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్ల వెంట, విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలకు చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడుతున్నాయి. దీంతో బరువు తట్టుకోలేక స్తంభాలు కిందపడుతున్నాయి. విద్యుత్ తీగలు తగిలి మూగజీవాలతోపాటు పులువురు మృత్యువాత పడుతున్నారు. ఈ వర్షాకాలంలో జిల్లాలో 149 విద్యుత్ స్తంభాలు విరిగి రూ.15లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు.



ధర్మోర-వట్టోలి మార్గంలో నరికిన చెట్లు

మండలంలోని ధర్మోర-వట్టోలి రోడ్డు, అబ్దుల్లాపూర్, లోకేశ్వరం-పుస్పూర్ రోడ్డు, పంచగుడి-లోకేశ్వరం ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ తీగల కింద నాటిన మొక్కలను ఏటా తొలగిస్తున్నారు. మళ్లీ ఆ ప్రాంతంలోనే కొత్తవి నాటుతున్నారు.

తీగల కింద నాటొద్దు..

విద్యుత్ తీగల కింద మొక్కలు నాటొద్దని లోకేశ్వరం విద్యుత్ ఏఈ శివకుమార్ పేర్కొన్నారు. రోడ్ల వెంట తీగలున్న చోట హరితహారం మొక్కలు నాటడం వల్ల తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు.

వసంతి పంచమి వేడుకలు



నిర్మల్‌లోని అల్ఫోర్స్‌లో సరస్వతీదేవి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న విద్యార్థులు



కుభీర్‌లో పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

కుభీర్: మండలకేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. హోమం జరిపి 25 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంతకు ముందు ముందు ప్రత్యేక పూజలు చేశారు. పూజారి తివారి,వేణుమాధవ్, ప్యాట లక్ష్మణ్, ప్రధానాచార్యులు హన్మాండ్లు, ప్రబంధకారిణి సభ్యులు పిరాజీ, పోశెట్టి, లింగన్న, ధర్మరాజు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి చిత్రపటానికి ఉపాధ్యాయులు విద్యార్థులు పూజలు చేశారు.

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్, తిర్పెల్లి, పొట్టపెల్లి(కె), వడ్యాల్, బోరిగాం, మల్లాపూర్, కనకాపూర్ గ్రామాల్లో వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలు, ఆలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

కుంటాల: మండలంలోని కల్లూర్, కుంటాల, ఓలా గ్రామాల్లో పాఠశాలల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. చిన్నారుల నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. గురుస్వామి వైదిక పండితులు ఆచా ర్యతేజ చక్రవర్తులు, ప్రిన్సిపాల్లు కొత్తకాపు గంగన్న, సాయిలు, సంతోష్, నందు, శ్రీకాంత్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లి, గుజరిగల్లి, పులేనగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముందుగా పాఠశాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సరస్వతి అమ్మవారికి పూజాది కార్యక్రమాలు, గాయత్రి హోమం చేశారు. అనంతరం చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.



లోకేశ్వరం: మన్మద్‌లో పూజలు చేస్తున్న నేతలు

సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

లోకేశ్వరం: వసంత పంచమిని పురస్కరించుకొని మండలంలోని మన్మద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేశారు. వేదపండితులు పూజలు చేసి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్, ఎంఈవో చంద్రకాంత్, ఎంపీపీ లలిత, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు, రాజారాం, వీడీసీ సభ్యులు ఉన్నారు.

తానూరు: మండలంలోని భోసి గ్రామ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దత్తాత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కుంటాలలో సరస్వతీదేవి వేషధారణలో చిన్నారులు



లక్ష్మణచాంద: రాచాపూర్‌లో..



భైంసాటౌన్: గుజరిగల్లిలో..

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోలు, తహసీల్దార్లు

ఖానాపూర్ ఎంపీడీవోగా సునీత

ఖానాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఖానాపూర్ ఎంపీడీవోగా జె.సునీత బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోను ప్రజాప్రతినిధులు, సిబ్బంది, కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మోహిద్, వైస్‌ఎంపీపీ వాల్‌సింగ్, ఎంపీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తానూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా మోహన్‌సింగ్

తానూరు: మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా మోహన్‌సింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ బదిలీపై నిజామాబాద్ జిల్లా నందిపేట్‌కు వెళ్లారు. ఎంపీవో మోహన్‌సింగ్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. కార్యాలయ సిబ్బంది వారిని ఘనంగా సన్మానించారు.

కుంటాల ఇన్‌చార్జి ఎంపీడీవోగా అబ్దుల్ రహీం

కుంటాల: మండల ఎంపీవో అబ్దుల్ రహీంకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పజెప్పారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి బదిలీపై మంచిర్యాల వెళ్లారు.

లక్ష్మణచాంద ఎంపీడీవోగా రాంప్రసాద్

లక్ష్మణచాంద: మండల ఎంపీడీవోగా రామ్‌ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన శేఖర్ బదిలీపై వెళ్లారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోను సన్మానించారు. ఎంపీవో నసీరుద్దీన్, ఏపీవో ప్రమీల, సిబ్బంది ఉన్నారు.

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద తహసీల్దార్‌గా జానకి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన శ్రీలత బదిలీపై వెళ్లగా జానకి బాధ్యతలు స్వీకరించారు. నూతన తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

సోన్ ఎంపీడీవోగా సురేశ్

సోన్: మండల ఎంపీడీవోగా సురేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో ఎంపీడీవోగా పని చేసిన సురేశ్ సోన్‌కు రాగా.. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన మోహన్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన ఎంపీడీవోను ఎంపీవో ఖలీల్ హైమద్, కార్యాలయ, ఐకేపీ సిబ్బంది సన్మానించారు.

నర్సాపూర్(జి) ఎంపీడీవోగా పుష్పలత

నర్సాపూర్(జి): నర్సాపూర్(జి) ఎంపీడీఓగా తుల పుష్పలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంద్రవెల్లి నుంచి బదిలీపై మండలానికి వచ్చారు. ఇక్కడ పని చేసిన వనజ నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీవోను జెడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శులు, సిబ్బంది సన్మానించారు.

పెంబి ఎంపీడీవో రమాకాంత్ రావు

పెంబి: పెంబి నూతన ఎంపీడీవోగా రమాకాంత్ బాధ్యతలు స్వీకరించారు. వారిని కార్యాలయంలో ఈజీఎస్, పంచాయతీరాజ్ సిబ్బంది సన్మానించారు. ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులు ఉన్నారు.

భైంసా ఎంపీడీవోగా సుధాకర్‌రెడ్డి

భైంసాటౌన్: భైంసా ఎంపీడీవోగా పి.సుధాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన గోపాలకృష్ణారెడ్డి బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది నూతన ఎంపీడీవోను శాలువాతో సత్కరించారు.

కడెం ఎంపీడీవోగా అరుణ

కడెం: కడెం నూతన ఎంపీడీవోగా బి.అరుణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన వెంకటేశ్వర్లు నిజామాబాద్ జిల్లాకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో ఆదిలాబాద్ జిల్లాలో ఎంపీడీవోగా పని చేసిన అరుణ కడెంకు బదిలీపై వచ్చారు. నూతన ఎంపీడీవోకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

సారంగపూర్ ఎంపీడీవోగా లక్ష్మీకాంత్‌రావు

సారంగపూర్: మండల నూతన ఎంపీడీవోగా లక్ష్మీకాంత్‌రావు బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

మామడ ఎంపీడీవోగా సుశీల్‌రెడ్డి

మామడ: నూతన ఎంపీడీవోగా సుశీల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన రమేశ్ బదిలీపై బోథ్ ఎంపీడీఓగా వెళ్లారు. మామడ తహసీల్దార్‌గా సుధాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సర్ఫరాజ్ దస్తురాబాద్ వెళ్లగా.. కామారెడ్డి జిల్లా లింగంపేట్ తహసీల్దార్‌గా పని చేసిన సుధాకర్ మామడకు వచ్చారు.

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ తహసీల్దార్‌గా బి.స్వాతి, ఎంపీడీవోగా అరుణరాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన డి.సరిత నిజామాబాద్ జిల్లాకు..ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన మోహన్ మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్లారు. వారిని తమ కార్యాలయాల్లో సిబ్బంది సన్మానించారు.

రేపటి సమ్మెను జయప్రదం చేయాలి

ఖానాపూర్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల16న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లెపు పీటర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించి విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సురేందర్, మహమూద్, అరుణ, భవాని ఉన్నారు.

మామడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రాజన్న అన్నారు. బుధవారం మండలంలోని న్యూసాంగ్వి గ్రామంలో బీడీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. అన్ని వర్గాల కార్మికులు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ నాయకులు వసంత, రేణుక, గురుచరణ్, మమత, గంగాధర్ పాల్గొన్నారు.



మామడ: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

భైంసాటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో కుభీర్ మండలంలోని రంజని, బెల్గాంకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి నారాయణ్‌రావుపటేల్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కె.దేవేందర్, కె.గంగాధర్, బాలాజీ, రాహుల్, కె.భూమేశ్, ఎం.గంగాధర్, దేవన్న, సురేందర్, భోజన్న, బెల్గాం గ్రామ నాయకులు వినోద్, తానాజీ పటేల్, పరశురాం, పరమేశ్, దళిత్, గణేశ్, రితేశ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు శంకర్ చంద్రే, సింధే ఆనంద్ రావు పటేల్, జావిద్‌ఖాన్, బషీర్, అంజాద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారితో నారాయణ్‌రావు పటేల్

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



లోకేశ్వరం: మంగళహారతులతో మహిళలు



సోన్ : కద్తాల్‌లో విగ్రహం వద్ద భక్తులు

లోకేశ్వరం: మండలంలోని మొహళ గ్రామంలో హనుమాన్ ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ముగిసింది. దేవతరాధన హోమం, గర్తసంస్కారం, యంత్రమూర్తి ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, శిఖర స్థాపన, పూర్ణాహుతి, దేవతావిసర్జన పాక్షణ కార్యక్రమాలను వేద పండితులు భగవన్ జోషి నిర్వహించారు. అనంతరం భక్తులు ఆలయంలో పూజలు చేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, వైస్ ఎంపీపీ నారాయణ్‌రెడ్డి, శివచరణ్, ముత్తన్న, రమేశ్, గంగాధర్, భూమానందం, భోజన్న ఉన్నారు.

సోన్: మండలంలోని కద్తాల్ గ్రామం బుధవారం జై శ్రీరాం.. జైహనుమాన్ నినాదాలతో మారుమోగింది. గ్రామ గల్ఫ్ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన 23 అడుగుల ఆంజనేయస్వామి భారీ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలోని పురవీధుల గుండా పల్లకిలో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సతీమణి కవితారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

'అవకాశమిస్తే మరింత సేవ చేస్తా'

ఖానాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరుగని ఉద్యమాలు చేసి తనకు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేసే అవకాశమిస్తే ప్రజాసేవలో ఉంటూ మరింత సేవ చేస్తానని మానవ హక్కుల వేదిక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ఆత్రం సుగుణక్క అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కఠినంగా శిక్షించాలి

అలేఖ్యను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని సుగుణక్క అన్నారు. ఖానాపూర్‌లోని అంబేద్కర్‌నగర్ కాలనీలో అలేఖ్య కుటుంబాన్ని పరామర్శించారు. రాధాబాయి, గాజుల స్వప్న, సాగర్, భాస్కర్, పీటర్, సురేందర్, శ్రీనివాస్, రాంచందర్, రాజశేఖర్ తదితరులున్నారు.

కడెం: కాంగ్రెస్ పార్టీ నుంచి ఆదిలాబాద్ ఎంపీ టికెట్ ఆశిస్తున్న ఆత్రం సుగుణ బుధవారం కడెంలోని హరిత రిసార్ట్స్‌లో కాంగ్రెస్ నాయకులను కలిశారు. ఇందులో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్, గొళ్ల వెంకటేశ్, రఫీక్, బబ్లూ, భూషణ్, రహీం, రమేశ్, చాంద్‌పాషా, ఇస్రూ తదితరులు ఉన్నారు.

నాగదేవత ఆలయ వార్షికోత్సవం

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో నాగదేవత ఆలయ 20వ వార్షికోత్సవం బుధవారం ఆలయ కమిటీ, వీడీసీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా శ్రీకాంత్ బృందం, పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. లడ్డూను చందారం గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి రూ.8600లకు వేలంలో దక్కించుకున్నాడు. భక్తులకు అసౌకర్యం కలగకుండా పోలీసులు, ఎన్‌సీసీ విద్యార్థులు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

సంక్షిప్త వార్తలు

రైతులకు విత్తనాలు పంపిణీ

ఖానాపూర్: మండలంలోని పాతతర్లపాడ్ గ్రామంలో బుధవారం రైతులకు డ్రీమ్ సొసైటీ ఆధ్వర్యంలో తొమ్మిది మంది పాడి రైతులకు అజోల్ల విత్తనాలు(నాచురకం గడ్డి), పాలిథీన్ షీట్లను ఉచితంగా అందజేశారు. రైతులు ఎనిమిది ఫీట్ల పొడవు, ఆరు ఫీట్ల వెడల్పు, ఫీటు లోతు తవ్వుకొని ఆవుపేడ మిశ్రమం, పుట్టమట్టి, మినరల్ మిక్చర్ వేస్తే వారం రోజుల తర్వాత తయారైన గడ్డిని జీవాలకు ఆహారంగా అందించాలని సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. చిన్నయ్య, రవి, రాకేశ్, శేఖర్ ఉన్నారు.

బహుమతి ప్రదానం

సోన్: నిర్మల్‌లోని సోఫినగర్ గురుకులంలో మంగళవారం జిల్లా స్థాయి ఇంగ్లిష్ డ్రామా పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. మండలంలోని కద్తాల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జూలియస్ సీజర్ డ్రామా పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్ తెలిపారు. ప్రతిభ కనబరిచినందుకు బుధవారం అమృత వర్షిని, చైత్ర, హరిప్రియ, నవ్య, లక్ష్మిలను ఉపాధ్యాయులు అభినందించారు.

సన్మానం

నర్సాపూర్(జి): మండలంలోని బామిని(బి)లో ప్రత్యేకాధికారి, తహసీల్దార్ శ్రీనివాస్‌ను గ్రామస్తులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, పోశెట్టి, కార్యదర్శి గంగాజల, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

24న కల్యాణం

నిర్మల్‌రూరల్: శ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షులు వట్టిమల్ల రమణ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని బైల్‌బజార్ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం కల్యాణానికి సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు. భక్తులు తరలిరావాలని కోరారు. విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకోజీ కిషన్, కార్యదర్శి బ్రహ్మయ్య, శివకుమార్, వెంకటస్వామి పాల్గొన్నారు.

పనులు ప్రారంభం

సారంగపూర్: మండలంలోని ఆలూరు గ్రామంలో ఉపాధి నిధులు రూ.తొమ్మిది లక్షలతో చేపట్టే సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులను బుధవారం గ్రామ ప్రత్యేకాధికారి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. దండు సాయికృష్ణ, భూమేశ్, చిన్నయ్య, రవి తదితరులు ఉన్నారు.